క్లుప్తంగా

సాయం చేసేందుకు వెళ్తే దాడులు చేస్తారా?

జనగామ: ఖమ్మం వరద బాధితులకు సాయం చేసేందుకు అక్కడి బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులతో వెళ్లిన మాజీ మంత్రి హరీశ్ రావు, ఇతర బృందంపై కాంగ్రెస్ గుండాలు దాడులు చేయడం అత్యంత హేయనీయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వరదలో చిక్కుకుని దయనీయ పరిస్థితుల్లో ఉన్న ప్రజలకు అండగా నిలువాల్సింది పోయి, బాధితుల పక్షాన నిలిచిన బీఆర్‌ఎస్ నేతలపై దాడులు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేసు నమోదు

చిల్పూరు: అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్ర వాహనం నడిపి ఒకరిని ఢీకొట్టిన వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30వ తేదీ సాయంత్రం సుదమల్ల శోభన్‌బాబు–హరిత ద్విచక్ర వాహనంపై స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి హనుమకొండకు వెళ్తున్నారు. కాగా, చిన్నపెండ్యాలలోని పెట్రోల్ బంక్ సమీపం యూటర్న్ వద్ద జఫర్‌గఢ్ మండలం సూరారం గ్రామానికి చెందిన మంచోజు సోమయ్య అతివేగంగా అజాగ్రత్తగా ద్విచక్ర వాహనంతో శోభన్‌బాబు బైక్‌ను ఢీకొట్టాడు. ఈ క్రమంలో వాహనంపై కూర్చున్న హరితకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. మంగళవారం శోభన్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చిమొక్కలు తొలగించాలి

జనగామ రూరల్: పట్టణంలోని బాణాపురం 5వ వార్డును పాలకులు పట్టించుకోవడం లేదని, ఇందిరమ్మ కాలనీలో పిచ్చిమొక్కలను తొలగించాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పందిళ్ల కళ్యాణి అన్నారు. మగళవారం ఇందిరమ్మ కాలనీలో ఆమె నాయకులతో కలిసి వార్డు సర్వే నిర్వహించి మాట్లాడారు. పట్టణానికి దూరంగా ఉన్న బాణాపురాన్ని అధికారులు, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ పట్టించుకోవడం లేదన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాల్లో బ్లీచింగ్ చల్లి, దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. లలిత, మమత, శ్రీను, మహేందర్, ఉపేంద్ర, సువర్ణ, విజయ, సోమయ్య, రేణుక పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



బచ్చన్నపేట: ఎడతెరిపి లేని వర్షాలకు మంగళవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సుద్దాల యాదగిరి ఇల్లు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పలువురి ఇళ్లు కూలిపోయాయి. సంబంధిత అధికారులు సర్వేలు చేసి నష్టపోయిన బాధితులకు పరిహారం ఇప్పించాలని పలువురు కోరుతున్నారు.

కడవెండిలో..



దేవరుప్పుల: ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు పలు గ్రామాల్లో పాతకాలపు ఇళ్లు ధ్వంసమయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కడవెండికి చెందిన చేనేత కార్మికుడు నల్ల అశోక్‌కు చెందిన ఇల్లు కూలిపోయే దశకు వచ్చిందని, పొట్టకూటి కోసం మగ్గం నేద్దామన్నా వర్షంతో నేయలేని దుస్థితి నెలకొందని వాపోయారు. ఇలాంటి బాధితులకు పెండింగ్‌లో ఉన్న డబుల్‌బెడ్రూంమ్‌లు లేదా ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తింపజేసి గూడు కల్పించాలని కోరుతున్నారు.

వర్షాలకు గేదె మృతి



నర్మెట: వారం రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు మండల కేంద్రానికి చెందిన రైతు మేకల రవికి చెందిన నిండు చూడి పాడిగేదె మృతి చెందినది. సోమవారం రాత్రి కొట్టంలో కట్టేసి వచ్చిన రైతు మంగళవారం ఉదయం తిరిగి వెళ్లిచూడగా గేదె మృతిచెంది ఉంది. గేదె మృతితో రూ. 80 వేలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

సంతాపం

చిల్పూరు: భారీ వర్షాల కారణంగా మృతి చెందిన వారి పట్ల మంగళవారం మండలంలోని రాజవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ నోడల్ అధికారి దాసరి గోవర్ధన్ మాట్లాడుతూ వర్షాల కారణంగా యువ శాస్త్రవేత్త అశ్వినిరెడ్డితో పాటు పలువురు మృతి చెందడం బాధాకరమని అన్నారు.

‘అంగన్‌వాడీ’ సేవలు వినియోగించుకోవాలి



లింగాలఘణపురం: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ రమాదేవి



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న సీడీపీఓ ఫ్లోరెన్స్



బచ్చన్నపేట: చిన్నారులు, తల్లులతో మనోహర



జనగామ రూరల్: రీడింగ్ ఏ థాన్ కార్యక్రమంలో తల్లులు, ఐసీడీఎస్ అధికారులు



చిల్పూరు: రీడింగ్ ఏ థాన్ కార్యక్రమంలో చిన్నారులు, తల్లులు, అంగన్‌వాడీలు



జఫర్‌గఢ్: వడ్డెగూడెంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి

● ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి

లింగాలఘణపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ రమాదేవి అన్నారు. మండలంలోని బండ్లగూడెం రైతు వేదికలో అంగన్‌వాడీ టీచర్లకు పోషణ మాసం కార్యాచరణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పోషణ్ మాసం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈనెల 30వ తేదీ వరకు నిర్వహించే రోజు వారీ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు హంసమ్మ, పుష్ప, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

తాటికొండలో..

స్టేషన్‌ఘన్‌పూర్: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యతో పాటు పిల్లలు, గర్భిణులు, తల్లులకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫ్లోరెన్స్ అన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాటికొండ గ్రామంలోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ కె.ధనలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం రీడింగ్ ఏ థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదవడం ఒక మంచి అలవాటు అనే నినాదంతో అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలోని మహిళలతో రీడింగ్ ఏ థాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నారన్నారు. పిల్లలు, తల్లులకు సరైన పౌష్టికాహారం అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో తాటికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్యరాణి, ఏఎన్‌ఎం నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన రీడింగ్ ఏ థాన్ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం చింతల కన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులకు కథల పుస్తకాలు చదివించడం, వినిపించడం చేశారు. అంగన్‌వాడీ టీచర్లు మంద రేణుక, గుర్రం నీనా, మంతెన విజయరాణి, అన్నం రోజారమణి, నామోజు జ్యోతి, కర్ణకంటి వాణిస్వర్ణవీణ ఉపాధ్యాయులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌నగర్‌లో..

బచ్చన్నపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు చక్కని విద్యాబోధన అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మనోహర అన్నారు. గోపాల్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, లక్ష్మి, ఆయాలు యాదలక్ష్మి, అంబవ్వ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

జనగామ రూరల్: పిల్లలు, తల్లులు, గర్భిణులు పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పూర్ణిమ అన్నారు. పోషణ మాసంలో భాగంగా పట్టణంలోని సత్రం కాలనీ, కురుమవాడలో రీడింగ్ ఏ థాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లలకు కథలు చెప్పి చదివించారు. టీచర్ స్వర్ణలత, ఆయా లక్ష్మి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల విద్యాభివృద్ధికి అంగన్‌వాడీలు దోహదం

జఫర్‌గఢ్: పిల్లలకు సరైన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి అంగన్‌వాడీలు ఎంతో దోహదం చేస్తున్నాయని అంగన్‌వాడీ టీచర్ తాటికాయల రాజేశ్వరి తెలిపారు. పోషణమాసం సందర్భంగా వడ్డెగూడెంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో రీడింగ్ ఏథాన్ ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తల్లులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్‌పీడీసీఎల్ ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ డీఈగా గడ్డం గణేశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఘన్‌పూర్ డీఈగా పనిచేస్తున్న మాలోత్ హుస్సేన్‌నాయక్ ఇటీవల రూ.20వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన విషయం విదితమే. దాంతో ఆయన స్థానంలో జనగామ టెక్నికల్ డీఈగా పనిచేస్తున్న గడ్డం గణేశ్‌కు అదనపు బాధ్యతలుగా స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ డీఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో డివిజన్‌పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



చిల్పూరు: యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు ఎడవెల్లి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో మంగళవారం యూత్ సభ్యులకు ఆయన క్రికెట్ కిట్‌ను అందజేసి మాట్లాడారు. యువత ఖాళీ సమయాల్లో క్రీడలను ఆడాలని అన్నారు.నారాయణరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, బూరనాదం, రమేష్, రాజయ్య, శ్రీను పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి



పొలంబాటలో డీఈ, సిబ్బంది

లింగాలఘణపురం: మెరుగైన విద్యుత్ కోసం రైతులు వ్యవసాయ బావుల వద్ద మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో డీఈ వెంకట లక్ష్మీనారాయణరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని వడిచర్ల సబ్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ‘విద్యుత్ శాఖ–రైతు పొలం బాట’ కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ వర్షాకాల సీజన్‌లో రైతులు విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. అదేవిధంగా సమస్యలు ఉంటే ట్రాన్స్‌కో సిబ్బంది దృష్టికి తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో డీఈ అనిల్‌కుమార్, ఏఈ శంకరయ్య, ట్రాన్స్‌కో సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

‘రుణమాఫీ’ ధ్రువీకరణ పత్రాల స్వీకరణ



ధ్రువీకరణ పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతుల నుంచి మండల వ్యవసాయాధికారులు రుణమాఫీ కోసం కుటుంబ సభ్యుల నిర్ధారణ ధ్రువీకరణ పత్రాలు స్వీకరించారు. రేషన్ కార్డు లేక పోవడం, ఇతర కారణాలతో రుణమాఫీ కాని రైతులు కుటుంబ సభ్యులతో పెద్ద ఎత్తున చేరుకోవడంతో రైతు వేదిక కిక్కిరిసిపోయింది. రైతుతో పాటు కుటుంబ సభ్యులతో ఏఓ సెల్ఫీ ఫొటో దిగారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి కాకి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మొత్తం 697 మందికి గాను ఇప్పటికే 440 మంది రైతులు సమర్పించిన అఫిడవిట్‌లను యాప్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. మిగతా రైతులవి ఈ నెల 6వ తేదీ వరకు పూర్తి చేస్తామన్నారు. రైతు దరఖాస్తుతో పాటు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓలు కళ్యాణి, సుస్మిత, కల్పన, వినోద్‌కుమార్, అఖిల, సుకన్య పాల్గొన్నారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్సీ మల్లన్న



గాయపడిన మహిళ కాళ్లు రుద్దుతున్న మల్లన్న

లింగాలఘణపురం: మండలంలోని జనగామ–సూర్యాపేట రోడ్డులో గుడిసెవాసుల కాలనీ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సొంత వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. పటేల్‌గూడేనికి చెందిన పెంతల సోని, నాగయ్య అలియాస్ నాగిరెడ్డి ద్విచక్ర వాహనంపై జనగామకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో గుడిసెవాసుల కాలనీలో నుంచి ఓ మహిళ అకస్మాత్తుగా రోడ్డుపైకి రావడంతో నాగయ్య సడన్ బ్రేక్ వేయడంతో కింద పడ్డారు. అప్పుడే మహబూబాబాద్‌లో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న మల్లన్న ప్రమాదాన్ని చూసి వెంటనే గాయాలైన మహిళ తలకు రక్తం కారకుండా తన చేతిరుమాలును కట్టి స్పృహ కోల్పోయిన మహిళ అరికాళ్లను రుద్దుతూ వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించాడు. దీంతో ఎమ్మెల్సీ మల్లన్న తీరును పలువురు అభినందించారు.

పాత ఇళ్ల కూల్చివేతతో తప్పిన ప్రమాదం



గోడ కూలడంతో విరిగిన స్తంభం, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో పాత ఇళ్లు కూల్చివేస్తుండగా విద్యుత్ స్తంభం విరిగి, టాన్స్‌ఫార్మర్ దెబ్బతిని తీగలు తెగి కిందపడటంతో ప్రమాదం తప్పిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న శిథిలావస్థ ఇళ్లను ఓ వ్యక్తి పొక్లెయినర్‌తో కూల్చి వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై గోడ కూలగా.. స్తంభం విరగడంతో పాటు దానికున్న 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతింది. అంతే కాకుండా విద్యుత్ తీగలు కింద పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికుల సమాచారంతో విద్యుత్ అధికారులు వెంటనే గ్రామానికి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపి వేశారు. విద్యుత్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ఐదు గంటల పాటు శ్రమించి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

అష్టదళ పాద పద్మారాధన పూజ



బంగారు పుష్పాలు చూపిస్తున్న అర్చకుడు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్త జనసందోహం నడుమ ఆలయ అభివృద్ధి శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతులు అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవోపేతంగా నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఈఓ మోహన్‌బాబు ఆధ్వర్యంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



చిల్పూరు: వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ బర్మావత్ శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు సీజనల్ వ్యాధులు–జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన కళాజాతాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా టీం లీడరు గద్దర్ సాంబయ్య ఆధ్వర్యంలో కళాకారులు ఆటపాటలతో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విజయ, బాలయ్య, శ్రీనివాసులు, చిరంజీవి, సంపత్‌కుమార్, రవి, కిరణ్‌కుమార్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బురద ఇలా.. బడికి వెళ్లేది ఎలా



చిల్పూరు: మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొండాపూర్‌తండాలో ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే దారి వర్షానికి బురదమయంగా మారింది. దీంతో పాఠశాలకు వెళ్లేది ఎలా అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. వర్షం కురిసిన ప్రతీసారి రోడ్డు బురదమయంగా మారుతోందని అన్నారు. ఈవిషయంపై పలుమార్లు గ్రామ పంచాయతీలో తెలిపినా పట్టించుకోవడం లేదని హెచ్‌ఎం వాణిరాణి తెలిపారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లు ఖాళీ చేయించండి



వెంకటేశ్వరపల్లి సందర్శనలో మాధవీలత

చిల్పూరు: శిథిలావస్థకు చేరిన ఇళ్లలోని వ్యక్తులను ఖాళీ చేయించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి మాధవీలత అన్నారు. మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. కాలనీలోని పులిగిల్ల ప్రమీల, బట్టమేకల యాదమ్మల పెంకుటిళ్లు, అద్దె భవనంలోని జీపీ భవనం శిథిలావస్థకు చేరడాన్ని గమనించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పన్నీరు మధుసూదన్‌తో మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉన్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని, అదే విధంగా గ్రామ పంచాయతీని వేరే భవనంలోకి మార్చాలని ఆదేశించారు. అనంతరం అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందజేస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, ఆయా సౌజన్య ఉన్నారు.

ప్రతిఒక్కరూ భగవద్గీత చదవాలి



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు

బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ తప్పకుండా భగవద్గీతను చదవాలని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీనాథ్‌శ్రేష్ఠి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జనగామ కమిటీ సభ్యులు కొన్నె ఉపేందర్, నాగలక్ష్మిల ఆధ్వర్యంలో కనుల పండువగా శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రభోదానంద యోగీశ్వరుల వారి దివ్యాశిస్సులతో గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశామన్నారు. కోలాటాల నడుమ శ్రీకృష్ణ భగవానుడి ప్రతిమను ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. జనగామ, భువనగిరి, చేర్యాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన ‘శ్రావణ’ ఉత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం పూర్ణాహుతితో శ్రావణమాస ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి గవ్యాంత పూజలు, విశేషాలంకరణ, శ్రీసూక్త పూజా విధానము, లలితాసహస్రనామ పారాయణ, శ్రీచండి హవనము, బిల్వార్చన, కుంకుమార్చన, తులసి అర్చన, పరివార దేవత హవనములు, పూర్ణాహుతి, అన్నపూజ, నీరాజనమంత్ర పుష్పములు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మోహన్‌బాబు, సూపరింటెండెంట్ వెంకటయ్య, ఆలయ అర్చకులు డీవీఆర్‌శర్మ, అనిల్‌శర్మ, నాగరాజు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించాలి



నర్మెట: వినాయక చవితి గణేశ్ నవరాత్రులను పురస్కరించుకుని మండలంలో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని యువచైతన్య యూత్ సభ్యులు కోరారు. ఈసందర్భంగా మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బిజ్జ గోవర్ధన్, కాసాని అంజనేయులు, ముక్కెర మహేందర్, కొన్నె రామకృష్ణ, శ్రీనివాస్, రాజేష్, శ్రీనివాస్, ముదిగొండ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కొడకండ్ల: మండలంలోని పాకాల గ్రామానికి చెందిన యలపాటి వెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిందె రామోజీ, మాజీ మార్కెట్ చైర్మన్ పేరం రాములు నాయకులతో కలిసి సోమవారం మృతురాలి కుమారులు లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డిలను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. వెంకటేశ్వర్‌రావు, సోమరాములు, ప్రేమ్‌కుమార్, వెంకటనారాయణ, మంగ్యానాయక్ ఉన్నారు.

నేడు ఈజీఎస్‌పై సోషల్ ఆడిట్

జనగామ రూరల్: 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సంపత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందని, ఆడిట్ అనంతరం నివేదికను సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

నేడు ద్విచక్ర వాహనాల వేలం

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు సీఐ సంతోష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీజ్ చేసిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

5న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

పాలకుర్తి: పాలకుర్తిలోని ఏడీఈ కార్యాలయం వద్ద విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈనెల 5న ఏర్పాటు చేయనున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ వేణుగోపాలచారి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1.00వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పాలకుర్తి, కొడకండ్ల మండలాల వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

సన్మానం

పాలకుర్తి: ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ కోదండరాంను డాక్టర్ చుక్కా రామయ్య ఫౌండేషన్ సభ్యులు హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. మాచర్ల పుల్లయ్య, బెల్లి దేవేందర్, అనుముల మహేందర్, ఉమామహేష్ ఉన్నారు.

నామినేటెడ్ పదవి ఇవ్వండి

జనగామ రూరల్: 30 ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న తనకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని పార్లమెంట్ మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్, న్యాయవాది జమాల్ షరీఫ్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి విన్నవించారు.

విద్యారంగానికి నిధులు పెంచాలి

పాలకుర్తి: విద్యారంగానికి నిధులు పెంచాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ కోరారు. టీపీటీఎఫ్ మండల కమిటీ సమావేశం డి. వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించడం, బిల్లులు రద్దు చేయడం అభినందనీయమని అన్నారు. పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు నిధులు పెంచాలని డిమాండ్ చేస్తే కేవలం 0.07 శాతం మాత్రమే పెంచడం సరికాదన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయలని అన్నారు. అనంతరం టీపీటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఎ.దయాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకటనర్సయ్య, కార్యదర్శులుగా ఎండీ షాహైసుత్తానా, శ్రీనివాస్, ఎస్.బుచ్చయ్య, జిల్లా కౌన్సిలర్లుగా ఇ. అశోక్, ఎస్.శేషగిరిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఓటు నమోదు చేయాలి



బచ్చన్నపేట: గ్రామాల్లో బీఎల్ఓలు నూతన ఓట్లను నమోదు చేయాలని నాయబ్ తహసీల్దార్ ఫణికిషోర్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటరు లిస్టులో తప్పులు, పేరు సవరణ తదితర అంశాలపై బీఎల్ఓలు ఇంటింటా సర్వే చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారి ఓట్లను ట్యాబ్‌లలో నమోదు చేయించాలన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎన్. అనిల్ (S.R) : 9949363827 (పాలకుర్తి)
కె. రాజశేఖర్ (S.R) : 9640341435 (జనగామ)
జి. రవియాదవ్ (A.C.O) : 9032782191